
నట్టేట ముంచిన వర్షం

కామారెడ్డి జిల్లాలో శుక్ర, శనివారాల్లో అకాల వర్షాల కారణంగా వరిపంటకు భారీ నష్టం వాటిల్లింది. కల్లాల్లో ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయ్యింది. పలుచోట్ల వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి కూడా నష్టం జరిగింది. అధికారులు స్పందించి నష్టాన్ని అంచనా వేసి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్


కృష్ణానగర్ తండాలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం


పుల్కల్‌లో తడిసిన వడ్లు


మొగులాన్ పల్లి తండాలో..


మహమ్మద్ నగర్‌లో..


పెద్దకొడప్‌గల్ జాతీయ రహదారిపై వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

క్లుప్తంగా

రోడ్లపై నిలిచిన నీళ్లు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట రోడ్డుపై శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు గ్రామస్తులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. గతంలో రోడ్డుపై మురికి నీరు ప్రవహిస్తుందని అధికారులు మురికి కాల్వపై కల్వర్ట్ నిర్మాణం చేపట్టారు. కల్వర్ట్ నిర్మాణం రోడ్డుకు ఎత్తు భాగంలో నిర్మించారు. దాంతో రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. కల్వర్టుతో పాటు రోడ్డు ఎత్తు పెంచకపోవడంతో కొద్దిపాటి వర్షం పడినా రోడ్డుపై నీరు నిలుస్తోంది. దాంతో వాహన చోదకులు, కాలినడకన వెళ్లే వారికి ఇబ్బందిగా మారింది.

బాధితులకు పరామర్శ



తాడ్వాయి(ఎల్లారెడ్డి):మండలంలోని సోమారం తండాలో బాధితుడిని శుక్రవారం రాత్రి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ పరామర్శించారు. తండాకు చెందిన సభావత్ ప్రకాష్‌కు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరగగా అతడిని, కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు అఖిల్‌రావు, నాయకులు జలందర్ రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు, గ్రామపెద్దలు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు..



గాంధారి(ఎల్లారెడ్డి) : బూర్గుల్ తాజా మాజీ సర్పంచ్ శివాజీని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ శనివారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ భార్య లక్ష్మీబాయి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బొప్పాజువాడి గ్రామానికి వెళ్లి పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ శంకర్ నాయక్, బలరామ్ నాయక్ తదితరులున్నారు.

వధువుకు పుస్తె, మట్టెల వితరణ



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని హరిజనవాడకు చెందిన తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ అలేఖ్య వివాహానికి బంగారు పుస్తె, వెండి మట్టెలను పట్టణానికి చెందిన మున్నూరుకాపు సంఘ సభ్యులు వితరణ చేశారు. శుక్రవారం వధువుకు వాటిని అందజేశారు. ఈ మేరకు వధువు బంధువులు దాతలు బొజ్జ రవీందర్,ఆకుల శ్రీనివాస్, మాసుల శ్రీనివాస్, రాజేష్, చలపతికి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని దేవాయిపల్లిలో బాధిత కుటుంబానికి పీఆర్టీయూ నాయకులు రూ. లక్ష చెక్కును అందజేశారు. పీఆర్టీయూ క్రియాశీల సభ్యత్వం తీసుకున్న దేవాయిపల్లికి చెందిన ఉపాధ్యాయుడు పైడి వెంకట్‌రాంరెడ్డి 10రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆ కుటుంబాన్ని పరామర్శించి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుశాల్, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సంగారెడ్డి, నర్సారెడ్డి, శివాజీరావు తదితరులున్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో తడిసిన ధాన్యాన్ని మండల పార్టీ అధ్యక్షులు సాయిబాబా, సొసైటీ వైస్ చైర్మెన్ ప్రశాంత్‌గౌడ్, డైరెక్టర్ గోపి పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని వారు రైతులకు భరోసా కల్పించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

బాన్సువాడ : అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బాన్సువాడ సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన బాన్సువాడలో మాట్లాడారు. ఇటీవల కురిసిన వడగళ్ల వర్షాలకు ధాన్యం గింజలు రాలిపోయాయని, రైతులు సాగు చేసిన వరి పంటలు పూర్తి దెబ్బతిందన్నారు. ప్రభుత్వపరంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. కొనుగోలు కేంద్రాలు కొనసాగాలంటే పౌరసరఫరాల డీఎం పాత్ర కీలకమని, జిల్లాలో సివిల్ సప్లయి డీఎం బదిలీ కావడంతో ఆయన స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో కొనుగోలు కేంద్రాలు సజావుగా సాగడం లేదని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు అంజిరెడ్డి, ఎజాస్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

బీడీ కార్మికులకు కూలి పెంచాలి

కామారెడ్డి అర్బన్ : రాష్ట్రంలోని బీడీ కంపెనీల్లో పని చేస్తున్న 7లక్షల మంది కార్మికుల వేతన ఒప్పందం ముగిసినందున 40 శాతం కూలి పెంచాలని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీలు చేసే కార్మికులకు వెయ్యి బీడీల తయారీపై ప్రస్తుతం ఉన్న వేతనంపై 40శాతం, ప్యాకర్లకు రూ. 6 వేలు, నెలసరి కార్మికులకు రూ. 3 వేలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆయా కంపెనీల యాజమాన్య సంఘాల ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసినట్లు సత్యం పేర్కొన్నారు. నూతన బీడీ కార్మికుల సంఘం నాయకులు హసన్, సిద్ధిరాములు, రాజేందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివంది సత్యం

రసవత్తరంగా కుస్తీ పోటీలు

బాన్సువాడ రూరల్ : మండలంలోని సంగోజీపేట్ గ్రామంలో శనివారం నిర్వహించిన కుస్తీపోటీలు ఆద్యాంతం రసవత్తరంగా సాగాయి. బాన్సువాడ మండలంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వచ్చిన మల్లయోధులు తమ ప్రతిభను చాటి నగదు బహుమతులు అందుకున్నారు. బాన్సువాడ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉగాది మహోత్సవాల్లో భాగంగా గ్రామదేవతల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. చివరి కుస్తీలో గెలిచిన వారికి వెండికడియాలు బహుకరించారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు, కులపెద్దలు తదితరులు పాల్గొన్నారు.


కుస్తీపడుతున్న మల్లయోధులు

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



బాన్సువాడలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు, మద్నూర్‌లో..

మద్నూర్/బాన్సువాడ రూరల్ : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో శనివారం అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌లను తహసీల్దార్ ముజీబ్ ఆవిష్కరించారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అగ్ని మాపక అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్, ఫైర్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మద్నూర్‌లో మండల కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో తయారు చేసిన ఫైర్ అండ్ సేఫ్టి వాల్‌పోస్టర్లను బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కార్యాలయ సిబ్బందితో పాటు అగ్నిమాపకశాఖ అధికారులు పి. రాజిరెడ్డి, రవిందర్‌గౌడ్, లింగం, హరిసింగ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలి



పిట్లం(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ యూత్ నాయకులు సొదాగర్ అరవింద్ హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తెలంగాణ యూత్ కాంగ్రెస్ జెనరల్ సెక్రటరీ రామకృష్ణ రెడ్డితో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ పరిధి మొత్తం తిరిగి ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపునకు కృషి చేస్తానన్నారు.

సీఎంను కలిసిన మాదిగ సంఘాల నేతలు

కామారెడ్డి టౌన్ : సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ సంఘాల ఫ్రంట్ నేతలు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం కలిశారు. జిల్లాకు చెందిన తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం, జిల్లా నాయకులు పాల్గొన్నారు. మాదిగల ప్రధానమైన పది డిమాండ్లను పరిష్కరించాలని సీఎంకు వినతిపత్రం అందజేశారు.



మాజీ విప్‌కు ఆహ్వానపత్రిక అందజేత



బీబీపేట : మండలంలోని మాందాపూర్‌లో ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు రావాలని మాజీ విప్ గంప గోవర్ధన్‌కు మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో గౌడ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 21 నుండి 24వ తేదీలలో నిర్వహించే ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో ఆయనను పాల్గొనాలని వారు కోరారు.

కాంగ్రెస్‌తోనే ముదిరాజ్‌ల అభివృద్ధి

దోమకొండ : ముదిరాజ్‌లకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం



దోమకొండ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ ఉత్సవాలకు షబ్బీర్‌అలీకి ఆహ్వానపత్రిక అందజేయగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ముదిరాజ్‌లకు కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పున్న లక్ష్మణ్, ఆలయ కమిటీ ప్రతినిధులు అబ్రబోయిన స్వామి, సీతారం మధు, కామిండ్ల నర్సింలు తదితరులున్నారు.

జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా యాకుబ్



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన యాకుబ్ అలీని నియమించారు. ఈ మెరకు శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నియామకపత్రాన్ని అందజేశారు. అలాగే ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి పలువురు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నేతలు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు పలువురు కలిసిన వారిలో ఉన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ పార్టీ



ఎల్లారెడ్డి రూరల్(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని చీనూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థులకు శనివారం ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. 6వ తరగతి విద్యార్థులు 7వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీలత, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని జీఎస్‌ఆర్ గార్డెన్‌లో ఆదివారం మండలస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నీటిఎద్దడి లేకుండా చేస్తున్నాం

ఎల్లారెడ్డిరూరల్/గాంధారి: నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని, నాలుగు నెలల పరిధిలోని నీటి ఎద్దడి లే కుండా గ్రామాల్లో 248 బోర్లు వేయించానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండల పార్టీ కార్యాలయంలో, గాంధారిలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఎ మ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లలో ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని బీఆర్‌ఎస్ పార్టీ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. 30 ఏళ్ల చరిత్ర లో ఎల్లారెడ్డి నియోజకవర్గం గురించి అసెంబ్లీలో మాట్లాడిన వారు లేరని అన్నారు. కేవలం ఎల్‌ఓసీ చెక్కులు అందజేశారన్నారు. త్వరలో జరగబోయే ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉషా గౌడ్, సొసైటీ వైస్ చైర్మెన్ ప్రశాంత్‌గౌడ్, మండల, పట్టణ అధ్యక్షులు కుర్మ సాయిబాబా, వినోద్‌గౌడ్, గోపి, చెన్న లక్ష్మణ్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

కాంగ్రెస్‌లో గౌరవం దక్కలేదు

- అందుకే బీజేపీలో చేరాను
- మాజీ ఎమ్మెల్యే సొదాగర్ గంగారాం

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : కాంగ్రెస్‌లో గౌరవం దక్కనందుకే బీజేపీలో చేరానని జుక్కల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సొదగర్ గంగారం పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని తన స్వగృహంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆయన సమక్షంలో బీజేపీ చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీ నుండి 4 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉన్న తనను కనీసం అధిష్టానం పట్టించుకోలేదన్నారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి పార్టీకోసం పనిచేశానన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అవుతాడని ప్రతిసమావేశంలో పేర్కొన్నానని అలాంటి నన్ను కాంగ్రెస్ నుంచి సస్పెండ్‌వేయడం బాధించిందన్నారు. బీజేపీలో చేసినందుకు ఆనందంగా ఉందన్నారు. బీబీ పాటిల్‌ను గెలిపించి జుక్కల్‌లో బీజేపీ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రణయ్ రెడ్డి, రామాగౌడ్, బందు పటేల్, మహేందర్ రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సొదాగర్ గంగారాం

మోదీ సర్కార్ రావడం తథ్యం

మద్నూర్(జుక్కల్) : మండలంలోని సోనాల గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు ఎన్నికల సందర్భంగా ప్రచారం నిర్వహించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే కేంద్రంలో మోదీ ప్రభుత్వం కొలువుదీరుతుందని వారు ప్రజలకు వివరించారు. ఈసారి ఎన్నికల్లో మన ప్రాంతానికి చెందిన అభ్యర్థి బీబీ పాటిల్‌కు మద్దతు తెలపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తుకారం, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు వెంకట్‌కాలే, నాయకులు కృష్ణ, తుల సంతోష్ తదితరులున్నారు.


ప్రచారం చేస్తున్న నాయకులు

ఆధ్యాత్మికం

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో ఉన్న వెంకటేశ్వరాలయంలో శనివారం ఉదయం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తి శ్రద్ధలతో భజన చేసుకుంటూ వెంకటేశ్వరా స్వామి చిత్రపటాన్ని ఆలయం ఆవరణలో చావ తీశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు వెంకట్‌రెడ్డి, సిద్దిరాములు, సూర్యం, గంగారాం తదితరులున్నారు.

వైభవంగా హనుమాన్ మండల పూజ



బాన్సువాడ : బాన్సువాడలో శనివారం హనుమాన్ దీక్ష స్వాముల మండల పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సరస్వతి మాత ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 15వ సామూహిక మండల పూజ మహోత్సవంలో ఉదయం గణపతి పూజతో ప్రారంభించారు. హనుమాన్ విగ్రహానికి లక్ష తమలపాకులతో అర్చనలు చేశారు. హనుమాన్ దీక్ష పీఠాధిపతులు దుర్గాప్రసాద్ స్వామిజీ మాట్లాడుతూ హనుమాన్ దీక్ష గురించి వివరించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శంభూరెడ్డి, దీక్ష స్వాముల వేముల నాగభూషణం తదితరులున్నారు.

ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని వజ్జపల్లి గ్రామంలో శనివారం శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా ఉదయం 11 గంటలకు పుణ్యవచనం, మండప పూజ హోమం నిర్వహించారు. అలాగే ఆదివారం సహస్ర కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రం నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ ప్రభాకర్ రావు, రామారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయానికి సామగ్రి అందజేత

భిక్కనూరు : మండల కేంద్రంలోని సంతోషిమాత ఆలయానికి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం గౌరిశెట్టి రమేశ్‌గుప్తా ఇత్తడి పూజ సామగ్రిని శనివారం బహూకరించారు. రూ. పదమూడు వేల విలువచేసే రెండు ఇత్తడి పెద్ద దీపం చెమ్మలు, మంగళహారతి, పూజసామాగ్రితో పాటు ఆలయానికి అమ్మవారికి ఉపయోగించే పట్టు కర్టెన్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం ప్రధానకార్యదర్శి గంగెల్లి మధుసూధన్, కోషాధికారి కోడిప్యాక అంజనేయులు,ప్రతినిది గూడెపు సిద్ధగిరి పాల్గొన్నారు.

హనుమాన్ స్వాములకు భిక్ష



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : హనుమాన్ స్వాములకు మాజీ ఎంపీపీ నక్క గంగాధర్ శనివారం భిక్ష ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేటలోని హనుమాన్ ఆలయంలో స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హనుమాన్ స్వాములు తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



భిక్కనూరు : దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ప్రజాపాలనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, మండలాధ్యక్షుడు భీంరెడ్డి, విండో చైర్మన్ గంగయ్య, నాయకులు నర్సింహారెడ్డి, శ్రీరాం వెంకటేశ్, అందె దయాకర్‌రెడ్డి, నీల అంజయ్య, బల్యాల సుదర్శన్‌లు పాల్గొన్నారు.

గాంధారిలో..

గాంధారి(ఎల్లారెడ్డి) : గాంధారి సింగిల్ విండో చైర్మన్, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ డైరెక్టర్ సాయికుమార్, తాజా మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, విండో డైరెక్టర్లు 60 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు.